క్లుప్తంగా

శారదాపీఠాన్ని సందర్శించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే పూర్ణచంద్ర ప్రసాద్

సింహాచలం: విశాఖ శ్రీ శారదా పీఠాన్ని శనివారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సందర్శించారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. జూలై 3వ తేదీ నుంచి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి చాతుర్మాస దీక్ష చేపట్టేందుకు ఈనెల 21న రుషికేష్ బయలుదేరి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో స్వామీజీని కలిసి ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు పూజలు చేశారు. వేద ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు అందజేశారు.

నేడు మహా రక్తదాన శిబిరం

సింహాచలం: అడవివరంలోని నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఉన్న ఆర్.ఆర్.ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. రక్తదాతలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మదర్‌బ్లడ్ బ్యాంక్, అమ్మ బ్లడ్ సెంటర్, విశాఖ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.


పాఠ్యపుస్తకాల అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధలతో నిపుణులను నియమించి సీబీఎస్ఈ పుస్తకాలకు దీటుగా వీటిని ముద్రించిందని చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, అంగన్‌వాడీ కార్యకర్త ముత్యాలరాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభిస్తున్న దాసరి సత్తిబాబు తదితరులు

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, దివంగత దాసరి రాజు జ్ఞాపకార్థం విరాట్‌నగర్‌లోని ఏపీఈపీడీసీఎల్ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి వైఎస్సార్ ఫుట్‌బాల్ కప్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ అభిమాని అక్కిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నీని 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, ఈపీడీసీఎల్ ఏఈఈ కుమార్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 స్కూళ్ల నుంచి 16 టీమ్‌లు టోర్నీలో పాల్గొన్నాయి. ఆదివారం మిగతా మ్యాచ్‌లు నిర్వహించి సాయంత్రం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతులమీదగా విజేత జట్లకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని దాసరి సత్తిబాబు తెలిపారు.

సమగ్ర సర్వేతో భూవివాదాలకు చెక్

● ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



రైతులకు సంపూర్ణ భూ హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: రైతుల మధ్య భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు వారికి సంపూర్ణ హక్కుతో భూ హక్కు పత్రాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా సమగ్ర భూ సర్వేపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్చకు తీసుకువచ్చినప్పుడు చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఎద్దేవా చేశారు..అయినప్పటికీ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని చిత్తశుద్ధితో పనిచేయడంతో సమగ్ర రీ సర్వే సాధ్యమైందన్నారు. శాటిలైట్,డిజిటల్ సర్వేద్వారా భూములు రీ సర్వే చేసి వారికి ఎల్‌పీఎంలు పంపిణీ చేసిన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మండలంలోని విప్పాక అగ్రహారం,పెదగొల్లలపాలెం గ్రామాలకు సంబంధించిన సుమారు 155 మంది రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేశారు. భూ హక్కు పత్రాల్లో ఏవైనా తేడాలు,తప్పులు దొర్లితే అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని సవరించి రైతులకు అందజేస్తారన్నారు. ఈ సంవత్సరం డిసెంబర్ చివరినాటికల్లా మిగిలిన గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేసి రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీలు దాడి ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్, తహసీల్దార్ బి. సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, ముఖ్యనాయకులు కొటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు,గొర్లి ఉమా మహేశ్వరరావు, కాపుశెట్టి శేషుబాబు, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



ఈవో భ్రమరాంబకు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయాలైన పైడితల్లమ్మ, బంగారమ్మ ఆలయాల అభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయించాలని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఈవో డి.భ్రమరాంబను కోరారు. ఈమేరకు దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఈవోను శనివారం కలిసిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, ముదుండి రాజేశ్వరి, దశమంతుల రామలక్ష్మి, పెనుమత్స శ్రీదేవివర్మ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ అడవివరం గ్రామదేవతలైన పైడితల్లి, బంగారమ్మ ఎంతో మహిమాన్వితమైన దేవతలని ఈవోకు వివరించారు. అంతటి విశిష్టత ఉన్న పైడితల్లి, బంగారమ్మ ఆలయాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. భక్తులు వంటలు చేసుకునేందుకు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు.ఇటీవల జరిగిన గ్రామ సభలో కూడా ఆలయాల అభివృద్ధికి తీర్మానం చేసినట్టు వివరించారు. తర్వలో జరగనున్న దేవస్థానం పాలక మండలి సమావేశంలో ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టి నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీతో పాటు పాఠశాల స్థాయిలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజుకు సూచించారు. జగనన్న విద్యా కానుక మండలంలోని 3,970 మంది విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 24 మంది విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు,రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు,మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.1,000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు. అంతక ముందు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సబ్బవరం శివాలయం ప్రాంగణంలోని సాయిబాబా సన్నిధిలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ప్రారంభించారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శనివారం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీఎం జగన్‌కే యువత మద్దతు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కమిటీల్లో నియామకాలు



విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న, వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే యువతంతా మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ యువజన విభాగం కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో యువజన విభాగ రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు, స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన యువకులు, జగనన్న అభిమానులు, పార్టీ యువజన విభాగ కార్యకర్తలంతా ముందుకు రావాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించే బాధ్యతను అందరూ తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తల ద్వారా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని ఆళ్ల శివగణేష్ విజ్ఞప్తి చేశారు. యువజన విభాగం నాయకుడు జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కాన్టెక్ ఎక్స్‌పో -2023



మాజీ చైర్మన్ కుమార్ రాజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్టెక్ ఎక్స్‌పో 2023 శనివారం కూడా కొనసాగింది. బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్ వేదికగా ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ ఉత్పత్తులను తిలకించేందుకు శనివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీజీఎన్‌పీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, కోస్ట్‌గార్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ వర్మ తదితరుల అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం వారిని నిర్వాహకులు సత్కరించారు. ఈ ప్రదర్శనలో భాగంగా యూనియన్ బ్యాంకు, మహామాయ సిమెంట్, సాగర్ సిమెంట్, వరుణ్ జేసీబీ స్టాల్స్‌ను వ్యాపారులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఈ ఎక్స్‌పో ద్వారా 60 స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనలు సాగాయి. ఈ కార్యక్రమంలో బీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్ వెంకటేశ్వర్లు, అఖిల భారత సభ్యుడు రామకోటయ్య, మాజీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

కూర్మన్నపాలెం : వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మంది ప్రజలకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 856వ రోజుకు చేరుకున్నాయి. ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో గళమెత్తాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధిలోని 11కేవీ, 11కేవీ సబ్బవరం రూరల్ ఫీడర్ లైన్ల నిర్వహణ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ కొంకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ డి1 సెక్షన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ కోతలు తగ్గించాలని ఆందోళన



విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

పరవాడ: మండలంలో విద్యుత్ కోతలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలకు నిరసనగా శనివారం సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గనిశెట్టి మాట్లాడుతూ విద్యుత్ కోతల కారణంగా చిరు వ్యాపారులు, కార్మికులు, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాత్రి వేళలో కరెంటు లేక నిద్ర లేమితో ప్రజలు అల్లాడిపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి కరెంటు కోతలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు హేమంత్, రమేష్, అప్పారావు, రమణ పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

మహారాణిపేట : ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) స్కీమ్ కోసం జాయింట్ కలెక్టర్ విశ్వనాథం ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ 19 మంది ముందుకు వచ్చారు. వీరికి శనివారం ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ పలు అంశాల్లో అవగాహన కల్పించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాసరావు

పరవాడ: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అన్నారు. పరవాడ ఎంపీపీ పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలను శనివారం ఆయన విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ ఒడి, నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన వంటి పథకాల ద్వారా పాఠశాలల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పెద్ద చెరువు ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పైల హరీష్, టీవీ అప్పారావు, వర్రి హరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింహగిరి.. భక్త ఝరి



సింహగిరి క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడానికి గంటల తరబడి నిరీక్షించారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయసాల, కేశఖండనసాల, ట్రాన్స్‌పోర్టు బస్సులు, ఆర్టీసీ బస్సులు, అన్నప్రసాద భవనం భక్తులతో రద్దీగా మారాయి. మధ్యాహ్నం రాజభోగం సమయంలో భక్తులు మాడ వీధుల్లో బారులు తీరారు. దేవస్థానం ఉద్యోగులంతా డిప్యుటేషన్‌పై సింహగిరిపై విధులు నిర్వర్తించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పరవాడ: అనకాపల్లి-గాజువాక జాతీయ రహదారిలో సాలాపువానిపాలెం సమీపంలోని తాడి మూడు మదుంల వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. శుక్రవారం అర్ధరాత్రి రహదారిలో ప్రయాణిస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడడం వల్ల ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రిలో భద్రపరిచామని తెలిపారు. ఫొటోను ఎవరైనా గుర్తు పడితే సమాచారం తమకు తెలియజేయాలని సీఐ ఈశ్వరరావు కోరారు.